సాక్షి
కర్నూలు
శనివారం, 4, అక్టోబర్, 2025



మళ్లీ కుంగిన రివిట్‌మెంట్
అవుకు రిజర్వాయర్ లోపల భాగంలో ఎర్రటి రాళ్లతో నిర్మించిన రివిట్‌మెంట్ మళ్లీ కుంగిపోయింది. చుట్టు పక్కల గ్రామాల రైతులు, ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. 10లో▸



వరద నీటి మళ్లింపుతోనే..
సముద్రంలో కలిసే కృష్ణా నీటిలో కొంత భాగాన్ని పోతిరెడ్డిపాడు ద్వారా కాలువలకు మళ్లిస్తే జిల్లాలో నీటి ఇబ్బందులు ఉండబోవని జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:14,268
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:13,961

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక సభ్యులుగా జిల్లా నేతలు

కర్నూలు (టౌన్): జిల్లాలో నేతలను వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక సభ్యులుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యనిర్వాహక సభ్యులుగా చెన్నకేశవ రెడ్డి (ఎమ్మిగనూరు), మణిగాంధీ (కోడుమూరు), రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి (కోడుమూరు), ఎల్లా రెడ్డి సీతారామరెడ్డి (మంత్రాలయం), పత్తికొండ రామ చంద్రారెడ్డి (పత్తికొండ), ఆర్. పురుషోత్తం రెడ్డి (మంత్రాలయం)లను నియమించారు.

గ్రామీణ యువకులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): శాస్త్రీయ పద్ధతులకు అనుగుణంగా తేనె ఉత్పత్తిని పెంచేందుకు గ్రామీణ యువకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎ.రాజాకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్‌బీహెచ్‌ఎం ఆధ్వర్యంలో తేనె ఉత్పత్తిని పెంచడంతో పాటు నూనెగింజల ఉత్పాదకత పెంచడం లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలలోనే బనవాసి కేవీకేలో ఏడు రోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం రాయితీపై తేనెటీగల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 79950 86793, 77023 66115, 80744 20092 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు

కర్నూలు(టౌన్): కర్నూలు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు పాతబస్తీకి చెందిన ఓ మైనర్ బాలుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అదే వీధిలో 10వ తరగతి చదివే ఓ బాలికతో స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. చనువు పెరిగి ఇద్దరూ దగ్గరవడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. గత నెల 20న బాలిక కడుపునొప్పితో బాధ పడుతుండటంతో తల్లి గ్రహించి ఆరా తీసింది. విషయం తెలుసుకుని ట్యాబ్లెట్లు ఇచ్చింది. తీవ్ర నొప్పితో బాధ పడుతున్న ఆ బాలిక ఇంట్లోనే శిశువుకు జన్మనిచ్చింది. తల్లిదండ్రులు వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. మైనర్ బాలికను మోసం చేసి గర్భవతిని చేసిన మైనర్ బాలుడిపై బాధిత తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ నెల 15 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె బాట

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ ఉద్యోగులు వివిధ డిమాండ్‌లను సాధించుకునేందుకు సమ్మె బాట పట్టనున్నారు. గత నెల 15 నుంచి 22వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి కానీ, విద్యుత్ సంస్థల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తదుపరి కార్యాచరణ ప్రణాళికను ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(23 సంఘాలు) సిద్ధం చేసింది. ఈ నెల 14లోపు తమ డిమాండ్‌లను పరిష్కరించకపోతే 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టేందుకు ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని జిల్లా జేఏసీ నేత సతీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 8న చలో తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్, 13న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14న వర్క్ టు రూల్ పాటిస్తామని, నిర్దిష్ట వేళల ప్రకారం ఆ రోజున పనిచేస్తామన్నారు. అప్పటికీ డిమాండ్‌లను పరిష్కరించకపోతే 15 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులకు ఆమోదం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 122 మంది గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు (డిజిటల్ అసిస్టెంట్స్) గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆమోదం తెలిపారని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందనున్న వారందరూ ఈ నెల 4న (నేడు) మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వారి సొంత మండలం, ప్లేస్ ఆఫ్ పోస్టింగ్స్‌కు సంబంధించి పరిశీలన ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి సర్వీస్ రిజిస్టర్లతో హాజరు కావాలని డీపీఓ కోరారు. కాగా, ఈ ఏడాది ఆగస్టు నెలలో ఉమ్మడి జిల్లాలోని 120 మంది గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గ్రేడ్ -5లో ఏర్పడిన ఖాళీలను గ్రేడ్ -6 కార్యదర్శుల పదోన్నతులతో భర్తీ చేయనున్నట్లు డీపీఓ తెలిపారు.



మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్రలో భక్తుల కర్రల సమరం

రణరంగం.. రక్తసిక్తం

- దేవరగట్టులో చిందిన రక్తం
- కర్రల సమరంలో 100 మందికి పైగా గాయాలు
- అందులో 40 మందికి తీవ్ర గాయాలు
- ఇద్దరు మృతి... మరి కొంతమంది పరిస్థితి విషమం
- మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోనికి తరలింపు

హొళగుంద: కర్రలు కరాళనృత్యం చేశాయి.. వందలాది తలలు పగిలాయి.. నలభై మందికి తీవ్రగాయాలయ్యాయి.. ఇద్దరు మృతి చెందారు. విజయదశమిని పురస్కరించుకుని హొళగుంద మండలం దేవరగట్టులో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు అనాదిగా వస్తున్న ఆచారమే కొనసాగింది. పోలీస్ నిబంధనలు, అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా బన్ని ఉత్సవం సాగి రణరంగాన్ని తలపించింది. ఉద్వేగంగా, ఉత్కంఠ భరితంగా సాగిన కర్రల సమరంలో దేవరగట్టు రక్తసిక్తమయ్యింది.

పాలబాసతో ఒక్కటై..
మాళమల్లేశ్వరస్వామి జైత్రయాత్ర (ఊరేగింపు)కు ముందు మాళమ్మ, మల్లేశ్వరునికి కల్యాణోత్సవాన్ని నిర్వహించడానికి నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట గ్రామస్తులు గురువారం రాత్రి 11.30 గంటలకు డొళ్లిన బండ వద్దకు చేరుకున్నారు. వర్గ వైషమ్యాలు, పాత కక్షలు, వ్యక్తిగత మనస్పర్థలను వీడి మూడు గ్రామస్తులు కలిసికట్టుగా ఉత్సవాన్ని జరుపుకుందామని పాలబాస తీసుకున్నారు. అనంతరం మూడు గ్రామాలకు చెందిన పెద్దలు కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు బండారం (పసుపు) ఇచ్చి వారి అనుమతి కోరారు. అధికారులు సమ్మతం తెలపడంతో డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన రింగు కర్రలు, అగ్గి కాగడాలు, దివిటీలతో అర్ధరాత్రి 12.20 గంటలకు కొండ పై ఉన్న స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు మంత్రోచ్చారణలు, భక్తులు జయ జయ ధ్వనుల మధ్య మాత మాళమ్మ, మల్లేశ్వరునికి అత్యంత వైభవంగా కళ్యాణోత్సవం జరిపించారు.



స్వామిని ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు



జైత్రయాత్ర అనంతరం సింహాసనకట్ట మీద కొలువైన మాళ మల్లేశ్వరుని ఉత్సవమూర్తులు



భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

డిర్రు..డిర్రు
కళ్యాణోత్సవం అనంతరం మాళమ్మ, మల్లేశ్వరుని విగ్రహాలతో పాటు పల్లకీని ఊరేగింపుగా దిగువకు తీసుకు వస్తుండగా అక్కడే ఉన్న ఇతర గ్రామాలకు చెందిన కొందరు భక్తులు అటకాయించారు. అగ్గి కాగడాలు విసురుకున్నారు. కర్రల శబ్దాలతో, డిర్రు... డిర్రు అంటూ విగ్రహాలను మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్టింపజేశారు. అనంతరం అక్కడి నుంచి జైత్రయాత్ర మొదలై ఉద్వేగంగా, ఉత్కంఠంగా ముందుకు సాగింది. సత్య నారాయణ కట్ట, కాడసిద్దప్ప మఠం పరిసరాల్లో భక్తుల కర్రలు తగిలి ఎన్నో తలలు పగిలాయి. నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెరతండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు మొగలాయిల్లో పాల్గొన్నారు. మొగలాయి ఆడుతున్న కొందరు అగ్గి కాగడాలతో దారి చేసుకుంటూ ముందుకు సాగారు.

పల్లకీ వద్ద అలజడి
పదాల గట్టు వైపు జైత్రయాత్ర వెళ్తుండగా బసవన్న గుడి సమీపంలోని నీటి ట్యాంకు వద్ద పల్లకీ మోస్తున్న వారితోపాటు చుట్టూ ఉన్న వారిపై రింగు కర్రలు, దివిటీలతో దాడి చేశారు. దీంతో పల్లకీ కింద పడిపోయినట్లు సమాచారం. ఆ సమయంలో కొందరి తలలు పగిలి తీవ్ర రక్త గాయాలయ్యాయి. వారికి హెల్త్ క్యాంపులో చికిత్స అందించారు. నెరణికి, అరికెర గ్రామ భక్తుల మధ్య దాదాపు అరగంట పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంతకు ముందు మెట్ల వద్ద కూడా అలజడి నెలకొంది. అనంతరం విగ్రహాలతో జైత్రయాత్ర దట్టమైన అడవిలో సుమారు 6 కి. మీ పరిధిలో ఉన్న ముళ్లబండ, పాదాల గట్టు మీదుగా రాక్షసపడి గుండ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి శమీవృక్షం వద్దకు తీసుకెళ్లారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులు కర్రలు, మిగిలిన ఆయుధాలను ఉంచి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శమీవృక్షం మీదుగా మాళ మల్లేశ్వర విగ్రహాలతో ఎదురు బసవన్న గుడి వైపుకు బయలుదేరాయి. అక్కడ ఆలయ పూజారి గిరిస్వామి భవిష్యవాణి(కార్ణీకం) వినిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను మల్లప్ప గుడిలోని సింహాసన కట్టమీద అధిష్టించి విజయ సూచకంగా భక్తులు చప్పట్లు కొట్టి ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు.

నేడు రథోత్సవం
దేవరగట్టులో శనివారం సాయంత్రం మాళ మల్లేశ్వర స్వామి రథోత్సవం ఘనంగా జరగనుంది. అదేవిధంగా 5న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, సాయంత్రం వసంతోత్సవం, కంకణ విసర్జన, 6న మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

పెత్తన, దౌర్జన్య కాలం

'ఆరు అరదాడితు హెచ్చర'
'గంగి హొళదండిగె నింతాళ..
ఉత్తర భాగక్కె హోతాళ'
రూ. 7,200 నగేహళ్లే, రూ. 3,400 జోళ,
3:6, 6:3'
అవుతుంది. అని కన్నడలో కార్ణీకం వినిపించారు. ఈ ఏడాది పెద్దల పెత్తనం, దౌర్జన్యం ఎక్కువ ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు ఉత్తరం దిక్కుకు పయనించి అక్కడ సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. దసరా తర్వాత 3 నెలలు వచ్చే దసరాకు ముందు 3 నెలల పాటు పంటల ధరలు తక్కువగా ఉంటాయని చెప్పారు.



భవిష్యవాణి వినిపిస్తున్న పూజారి గిరిస్వామి



గాయపడిన భక్తులు

పగిలిన తలలు.. చిందిన రక్తం
జైత్రయాత్రలో చాలా మందికి తలలు పగిలాయి. ఈ కర్రల సమరంలో 100 మందికి పైగా గాయపడ్డారు. 40 మందికి పైగా తీవ్ర గాయాలతో పరిస్థితి విషమంగా ఉండడంతో వారికి హెల్త్ క్యాంపులో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆదోని, ఆలూరు, గుంతకల్లు, కర్నూలుకు రెఫర్ చేశారు. మిగిలిన వారికి హెల్త్ క్యాంప్‌లో చికిత్స అందించారు. ఉత్సవంలో గాయపడిన భక్తుల్లో ఎక్కువ శాతం నాటుసారా, మద్యం సేవించిన వారే ఉన్నారు. మద్యంమత్తులో రింగు కర్రలు తగిలి, అగ్గి కాగడాలు మీద పడిన గాయాలయ్యాయి.

ఇద్దరు మృతి
బన్ని ఉత్సవాల్లో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన తిమ్మప్ప (46)పై రింగు కర్ర లతో కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చే లోపు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతునికి భార్య బసమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య బసమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఆదోనిలోని అరుణ జ్యోతి నగర్‌కు చెందిన ఆంజినేయ (48) బన్ని ఉత్సవాలు తిలకించేందుకు వచ్చి..తొక్కిసలాటలో ఊపిరాడక గుండెపోటుతో మృతి చెందాడు. ఈయనకు భార్య ఈరమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

రాక్షస గుండ్లకు రక్తార్పణ



దేవరగట్టు బన్ని ఉత్సవంలో భాగంగా జైత్రయాత్ర దట్టమైన అడవిలోని ముళ్ల బండ, పాదాల గట్టు మీదుగా రాక్షసపడి గుండ్ల వద్దకు చేరుకుంది. భయంకరమైన వాతావరణంలో కంఛాబీర వంశానికి చెందిన బసవరాజు అనే గొరువయ్య ఎడమ కాలు పిక్కల నుంచి డబ్బణం గుచ్చి వచ్చిన రక్తాన్ని మణి, మల్లా శురులుగా పిలిచే రాక్షస గుండ్లకు సమర్పించారు. ప్రతి ఏటా ఈ వంశస్తులే రాక్షస గుళ్లకు రక్తసంతర్పణ చేస్తారు. పాదాలగట్టు నుంచి 6 కి.మీ దూరంలో దట్టమైన అడవిలో ఈ రక్షపడి ఉంటుంది. గతంలో ఇక్కడికి చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ భయపడేవారు. గత ఏడాది నుంచి అక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించారు.

పోలీసు బందోబస్తు ఉన్నా...



బన్ని ఉత్సవాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, అధికారులు

కర్రల సమరంలో రక్తపాతాన్ని తగ్గించేందుకు జిల్లా పోలీసు, అధికార యంత్రాంగం చేసిన చర్యలు ఈ ఏడాది కూడా అనుకున్నంత ఫలితం ఇవ్వలేదు. అనాదిగా వస్తున్న ఆచారమే పై చేయిగా నిలిచింది. ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో ప్రత్యేక బలగాలు, మహిళా పోలీసులు, స్పెషల్ పార్టీలతో కలిసి మొత్తం కలిసి 800 మంది బందోబస్తు నిర్వహించారు. అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించడానికి వందల సంఖ్యలో సీసీ కెమరాలు, 4 డ్రోన్ కెమరాలు, దాదాపు 800 వరకు భారీ వెలుతురు ఇచ్చే లైట్లను ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. అయితే ఈ ఏడాది చాలా మంది గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందారు.

ప్రధాని మోదీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- రైతు బజార్ సర్కిల్ నుంచి చెక్‌పోస్టు వరకు రోడ్డు షో

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16న జిల్లాలో పర్యటించనున్నట్లు అందిన ప్రాథమిక సమాచారం నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని పర్యటన అధికారికంగా ఖరారు కాకపోయినప్పటికీ ప్రాథమిక సమాచారం మేరకు ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. నగరంలో 4వేల మందితో రోడ్ షో నిర్వహించే అవకాశం ఉందన్నారు. రైతు బజార్ సర్కిల్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్ షో నిర్వహించే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతోపాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, మునిసిపల్ కమిషనర్ విశ్వనాథ్, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి



ఆలయ పుష్కరిణిలో స్వామిఅమ్మవార్లకు తెప్పోత్సవం

తెప్పోత్సవం.. నేత్రానందభరితం

- శ్రీశైలంలో ముగిసిన దసరా ఉత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల్లో చివరిరోజు గురువారం భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నందివాహనసేవలో ఆదిదంపతులు విహరించారు. పూర్ణాహుతితో దసరా మహోత్సవాలు ముగిశాయి. గురువారం సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద నేత్రానందభరితంగా తెప్పోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, అధికారులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవాల్లో ఇద్దరు మృతి చెందడం బాధాకరం

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో గురువారం అర్ధరాత్రి ఇద్దరు భక్తులు మృతి చెందడం బాధాకరమని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుని మృతి చెందిన వారికి నివాళులర్పించి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉత్సవాలను అన్ని గ్రామాల ప్రజలు, భక్తులు సంప్రదాయంగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి నిర్వహించుకోవాలన్నారు. హింసాత్మకమై ప్రాణాల మీదకు తెచ్చుకోరాదని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మల్లేశ్వర స్వామికి పూజలు
దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు మాళామల్లేశ్వర స్వామిని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఎమ్మెల్యే సోదరులు శ్రీరాములు, తనయుడు చంద్రశేఖర్ ఆయన వెంట ఉన్నారు.



దేవరగట్టులో పూజలు చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద వైద్యుల ధర్నా

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 20 ఏళ్లుగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నా తమకు పదోన్నతులు రావడం లేదని, సీనియర్లు, జూనియర్లు ఒకే కేడర్‌లో పనిచేస్తున్నామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పదోన్నతులు లేకుండానే రిటైర్ అవుతున్నారని, వెంటనే తమకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదన్నారు. తామేదో గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, న్యాయమైన తమ డిమాండ్లను ఏళ్ల తరబడి అడుగుతున్నా పరిష్కరించడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం గత సంవత్సరం తమకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.మనోజ్, జాయింట్ సెక్రటరి డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న వైద్యులు

52 కేటగిరీల్లో జిల్లాకు స్వచ్ఛ అవార్డులు

కర్నూలు(సెంట్రల్): స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో భాగంగా జిల్లాలోని పలు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం 52 కేటగిరీల్లో స్వచ్ఛ అవార్డులను ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు బెస్ట్ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్, మరో మూడు బెస్ట్ స్వచ్ఛ ఎన్‌జీఓస్, మూడు బెస్ట్ స్వచ్ఛ హాస్పిటల్స్, ఐదు బెస్ట్ స్వచ్ఛ స్కూల్స్, ఐదు బెస్ట్ స్వచ్ఛ అంగన్‌వాడీలు, మూడు బెస్ట్ స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, ఒక బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రియల్ ఎస్టేట్, నాలుగు బెస్ట్ స్వచ్ఛ హాస్టళ్లు, ఒకటి బెస్ట్ రెసిడెన్షియల్ హాస్టల్, ఐదుగురు బెస్ట్ స్వచ్ఛ వారియర్స్, మరో ఐదుగురు బెస్ట్ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్లుగా అవార్డులు పొందినట్లు కలెక్టర్ వెల్లడించారు.

స్వచ్ఛ మున్సిపాలిటీ: కర్నూలు
స్వచ్ఛ గ్రామ పంచాయతీలు: కె.నాగలాపురం, పెద్ద టేకూరు, పసుపల, పెరవళి, మంచాల
స్వచ్ఛ స్లమ్ లెవెల్ ఫెడరేషన్: గూడూరుకు చెందిన మందారం ఎస్ఎల్ఎఫ్, కర్నూలుకు చెందిన శివాని ఐక్య సంఘం, ఎమ్మిగనూరుకు చెందిన ఆశాజ్యోతి ఫెడరేషన్.
స్వచ్ఛ రైతుబజార్: కర్నూలు రూరల్ మండలంలోని ఎ.నారాయణమూర్తి రైతుబజార్
స్వచ్ఛ బస్టాండ్: కర్నూలు ఆర్టీసీ బస్టాండ్

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఆర్.కొంతలపాడు గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప కుమారుడు కురువ గిడ్డయ్య (50) గత నెల 30వ తేదీన భార్యతో గొడవ పడి తన నివాసంలోనే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఇతనికి కుమారుడు, కుమార్తె సంతానం. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు తాలూకా పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆస్పరి: నగరూరు బస్టాప్ సమీపంలో గురువారం రాత్రి స్కూటర్‌ను ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో శశిధర్‌రెడ్డి (35) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఇతను గురువారం రాత్రి స్కూటర్‌పై ఆదోనికి వస్తుండగా ఆస్పరి దాటాక నగరూరు బస్టాప్ సమీంలో ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఐచర్‌వాహనం ఢీకొంది. ఈఘటనలో శశిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

అడ్రస్ అడిగి..బంగారు గొలుసు లాక్కెళ్లాడు

బనగానపల్లె రూరల్: ఓ అగంతకుండు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బనగానపల్లె పట్టణంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. కొండపేటలో నివసించే కర్నాటి రమాదేవి తెల్లవారుజామున ఇంటి ముందు నీళ్ల చల్లుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తలకు హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చాడు. ఈ కాలనీలో కొత్తగా తమకు తెలిసిన వాళ్లు చేరారని వారి ఇల్లు ఎక్కడుందని అడిగాడు. తెలియదని సమాధానం చెబుతుండగానే మెడలోని బంగారు గొలుసు లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కల్పన తెలిపారు.కాగా చోరీకి గురైన చైన్ సుమారు మూడు తులాలు ఉంటుందని రమాదేవి తెలిపారు.

ఈతకు వెళ్లి మృత్యు ఒడికి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

వెల్దుర్తి: బావిలో ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. కలుగొట్ల గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కూలీ పనులు చేసుకుని జీవించే నక్కలి ఎల్లకృష్ణ (45) ఇసుక వంక సమీపంలోని ఎస్సీ బావిలో ఈతకు వెళ్లాడు. అప్పటికే అక్కడ పలువురు ఈదులాడుతున్నారు. ఎల్లకృష్ణ బావి పై నుంచి తలకిందులుగా నీటిలోకి కొర్రు వేశాడు. అయితే, ఎంత సేపటికి బయటకు రాకపోవడం చూసి మిగతావారు గాలింపు చేపట్టగా వారికి కనబడలేదు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మద్దిలేటి, గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వెల్దుర్తి పోలీసులకు, డోన్ ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. డోన్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ సిబ్బంది, ఫైరింజన్‌తో కలిసి అక్కడికి చేరుకున్నారు. బావిలోపలికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడికి భార్య మల్లేశ్వరి ఉంది.

వరద నీటి మళ్లింపుతోనే పరిష్కారం

- సాగు,తాగు నీటి సమస్యపై జెడ్పీ చైర్మన్
- స్థాయీ సంఘ సమావేశాలంటే అంత చులకననా ?
- గైర్హాజరైన అధికారులకు నోటీసుల జారీకి ఆదేశం
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో అనేక అంశాలపై పాపిరెడ్డి సమీక్ష
- జెడ్పీ నిధుల ల్యాప్స్‌పై పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్ ద్వారా సముద్రంలో కలిసే నీటిలో కొంత భాగాన్ని పోతిరెడ్డిపాడు ద్వారా కాలువలకు మళ్లిస్తే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. వరద నీటి మళ్లింపుతో జిల్లాలోని వెలుగోడు, గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లను నింపుకోవడంతో పాటు కాలువల్లో నిరంతర ప్రవాహం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ దిశగా నీటి పారుదల శాఖకు చెందిన ఇంజినీర్లు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ ఏడాది జూన్ 22వ తేది నాటికి శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల కంటే ఎక్కువ నీరు ఉండిందని, పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చేసి ఉంటే కనీసం బోర్లు రీచార్జ్ అయ్యేవని ఇటీవల నంద్యాలలో జరిగిన ఐఏబీ సమావేశంలో ప్రస్తావించినట్లు చెప్పారు. శ్రీశైలం నీటి విడుదల మన చేతిలో లేదని, దీనికి తెలంగాణ ప్రభుత్వం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతులు కావాలని సంబంధిత పర్యవేక్షక ఇంజినీరు ప్రతాప్ సమాధానమిచ్చారని, సమాధాన ప్రతులను సమావేశంలో చూపించారు. శ్రీశైలం నీటిని పోతిరెడ్డిపాడుకు విడుదల చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ బీవీ సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశాలంటే అంత చులకననా.... ?

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలంటే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తరచు గైర్హాజరు అవడంపై జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సహేతుక కారణం లేకుండా, ఎలాంటి అనుమతి తీసుకోకుండా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులకు నోటీసులు జారీ చేయాలని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే తమకేమి పనుల్లేక సమావేశాలకు వస్తున్నామా? అసెంబ్లీ ద్వారా సభా హక్కుల నోటీసులను ఇప్పిస్తానని గైర్హాజరైన అధికారులకు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హెచ్చరించారు.

రూ.2 .50 కోట్ల నిధుల ల్యాప్స్‌పై పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

జిల్లా పరిషత్ నిధులతో నిర్ణీత సమయంలోగా చేపట్టాల్సిన పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించి రూ.2.50 కోట్ల నిధులు ల్యాప్స్‌కు కారణమైన పీఆర్ ఇంజినీర్లపై చర్యలు తీసుకునేందుకు పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇయర్ మార్క్‌డ్ నిధులు ఎస్సీ సంక్షేమానికి 15 శాతం , ఎస్టీల సంక్షేమానికి 6 శాతం, మహిళా శిశు సంక్షేమానికి 15 శాతం నిధులు మొత్తం రూ. 5.91 కోట్ల విలువ చేసే పనులను అప్పగించామన్నారు. ఈ పనులను ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయకుంటే నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందని ప్రతి నెలా పీఆర్ ఇంజినీర్లను హెచ్చరిస్తూనే ఉన్నామన్నారు. అయినా, పనుల్లో జరిగిన జాప్యం వల్ల రూ.2.50 కోట్ల నిధులు ల్యాప్స్ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

స్థాయీ సంఘ సమావేశాల్లో ఇంకా ఏం మాట్లాడారంటే

- ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలకు పనులు దొరుకుతున్నాయే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టడం లేదని జెడ్పీ చైర్మన్ అన్నారు. 'రబీ సీజన్‌లో రైతుల అవసరాలకు అనుగుణంగా శనగ, పప్పుశనగ విత్తనాలను అందించాలి. దివ్యాంగుల పెన్షన్లలో అర్హులైన అనేక మందికి నోటీసులు పంపించడం దారుణం. అర్హులైన వారందరికి పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపట్టాల'ని ఆయన చెప్పారు.
- ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్ర స్థాయిలో అవినీతి అక్రమాలు జోరుగా సాగుతున్నాయని, అలాగే గృహ నిర్మాణాల ఫ్లెక్సీలు పెట్టుకొని ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి చెప్పారు.
- కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి పారుమంచాల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పి. జగదీశ్వరరెడ్డి కోరారు.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



పగిద్యాలలో ఆర్మీ జవాన్ బడికెల తిక్కస్వామి అంతిమ యాత్ర



జవాన్ భార్యకు జాతీయ జెండా అందజేసి వందన సమర్పణ చేస్తున్న నాయక్ సుభేదార్ రామచంద్రన్

పగిద్యాల: ఆర్మీజవాన్ బడికెల తిక్కస్వామి(36)కి కన్నీటి వీడ్కోలు పలికారు. జమ్మూ కాశ్మీర్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురైన ఇతను ఢిల్లీ ఆర్‌ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. గురువారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో స్వగ్రామైన పగిద్యాలకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి నివాళుర్పించిన అనంతరం మేజర్ రాహుల్‌దత్ నేతృత్వంలో జవాన్ అంతిమ యాత్ర కొత్త పాలమర్రి నుంచి శ్మశాన వాటిక వరకు శోకసంద్రంగా సాగింది. అక్కడ ఆర్మీజవాన్లు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు మృతుడి భార్య సుభాషిణికి గుర్తుగా ఆర్మీఅధికారులు జాతీయ జెండాను అందజేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, తహసీల్దార్ శివరాముడు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేంద్రకుమార్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం , వివిధ కుల సంఘాల నాయకులు వీర జవాన్ తిక్కస్వామికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అధికారులమంటూ మెడికల్‌షాపులకు ఫోన్లు

- డబ్బులు పంపకపోతే సీజ్ చేస్తామని బెదిరింపు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని పలు మెడికల్‌షాపులకు కొందరు అగంతకులు శుక్రవారం ఫోన్ చేసి బెదిరించడం కలకలం రేపింది. తాము ఔషధ నియంత్రణ శాఖ ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్నామని చెబుతూ దుకాణాలకు సంబంధించి పలు విషయాలను చర్చిస్తూ వెంటనే రూ.10 వేలు ఫోన్‌లో పంపాలని, లేకపోతే వెంటనే మీ దుకాణానికి వచ్చి సీజ్ చేస్తామని, లైసెన్స్ క్యాన్సల్ చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో పలువురు దుకాణదారులు కంగారు పడటం, మరికొందరు బెదిరిపోయి వారితో మాట్లాడారు. ఇలాంటి వారితో అగంతకులు మరింత బెదిరింపు దోరణితో మాట్లాడుతూ డ్రగ్ కంట్రోల్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నా మీకు లెక్కలేదా...మా ఆఫీసుకు ఎప్పుడూ రాలేదా...మేమే మీ దుకాణానికి వస్తే ఎలాగుంటుందో చూస్తారా అంటూ మరింత బెదిరించసాగారు. పండుగ వేళ ఒక్కసారిగా ఇలాంటి బెదిరింపులు రావడంతో ఏమి చేయాలో అర్థం గాక దుకాణదారులు బెంబేలెత్తిపోయారు. ఇతర దుకాణదారులకు ఫోన్ చేయడంతో మాకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చాయని చర్చించుకున్నారు. నగరంలో పలు బిజీగా ఉండే దుకాణాలను ఎంచుకుని మరీ ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. కొన్ని దుకాణాలకు మెసేజీలు పంపి బెదిరించారు. కర్నూలులోని ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల గురించి తెలిసిన దుకాణదారులు ఎవరో అగంతకులు ఫోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేసి ఉంటారని భావించి ట్రూకాలర్‌లో వారి నంబర్లను పరిశీలించారు. అందులో ఒకటి ధ్యాన జ్యోతిగా, మరొకటి శ్రీనివాసులు నాయక్‌గా చూపించింది. ఈ మేరకు బెదిరింపు కాల్స్ వచ్చిన దుకాణదారులు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎంపీపీని దించే టీడీపీ కుట్రలు సాగవు

- కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష

కర్నూలు (టౌన్): కర్నూలు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ఎంపీపీని దించే కుట్రలు టీడీపీ మానుకోవాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హితవు పలికారు. కర్నూలు నగరంలోని ఎల్కూర్ ఎస్టేట్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం నూతనపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత క్రిష్ణ అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ఎమ్మెల్యేను కలిశారన్నారు. అయితే పార్టీ కండువా కప్పి టీడీపీలో చేరినట్లు ప్రకటించారన్నారు. ఆ పార్టీ ఎంతగా దిగజారిందో ఇట్టే అర్థమవుతుందన్నారు. క్రిష్ణ మాట్లాడుతూ.. గ్రామ సమస్యలు చర్చిద్దామని, బిల్లుల సమస్యలు మాట్లాడుదామని వెళ్లానని, అయితే పార్టీలో చేరుతున్నట్లు కండువాలు కప్పారన్నారు. దీంతో అక్కడ పది నిమిషాలు కూడా ఉండలేదన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం కోట్ల హర్షవర్ధన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, కర్నూలు మండల మాజీ ఉపాధ్యక్షులు డి. వాసు, కర్నూలు మండల వైస్. ఎంపీపీ నెహెమ్యా, కర్నూలు మండల కన్వీనర్ మోహన్ బాబు, ఆర్. కొంతలపాడు శ్రీనివాస రెడ్డి, సంపత్‌కుమార్, కోడుమూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు ఎం. కె. వెంకటేశ్వర్లు, మద్దిలేటి, పసుపల బాషా, మందలపాడు గోపాల్, నూతనపల్లె గ్రామస్తులు టి. మధు, ఎర్రమల, నారయణ, మద్దయ్య పాల్గొన్నారు.



క్రిష్ణకు పార్టీ కండువా కప్పిన కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

శ్రీమఠంలో భక్తి శ్రద్ధలతో దసరా వేడుకలు



శమీ వృక్షానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు



రాంపురంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వై. సీతారామిరెడ్డి

మంత్రాలయం: విజయదశమి వేడుకలను శ్రీమఠంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర మూల బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం శ్రీమఠంలో శమీ వృక్షానికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాష్ట్ర ఎస్‌ఈసీ మెంబర్ వై. సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, కుటుంబ సభ్యులు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అలాగే మంత్రాలయం పాత ఊరులో వెలసిన మారికాంబ దేవాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల బీమయ్యతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పూజలు చేశారు.

శమీ వృక్షానికి పూజ

కల్లూరు: దసరా పండుగను గురువారం ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని దుర్గామాతలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శమీవృక్షం పూజలో పాల్గొన్నారు. కల్లూరు అర్బన్ కల్లూరు, వీకర్‌సెక్షన్ కాలనీ శమీవృక్ష పూజ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శమీ వృక్షానికి, దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

వైభవంగా గుర్రాల పార్వేట

మద్దికెర: దేశంలో మైసూరు తర్వాత ఎక్కడా లేని విధంగా మద్దికెరలో దసరా ఉత్సవాలను నిర్వహిస్తారు. విజయదశమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం నిర్వహించిన గుర్రాల పార్వేట కార్యక్రమం అశేష జనవాహిని మధ్య వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దనగిరి, చిన్న నగిరి, యామనగిరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజుల దుస్తులతో ఠీవిగా గుర్రాలపై కూర్చుని తమ వెంట ఆయుధాలు ధరించిన సైనికులతో ఊరేగింపుగా గ్రామ సరిహద్దులో ఉన్న రాగిమాను కట్ట వద్దకు వచ్చారు. అనంతరం గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయుని పేట గ్రామంలో ఉన్న భోగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ప్రత్యేకంగా ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి గ్రామప్రజలే కాకుండా చుట్టుప్రక్కల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



గుర్రాల పారువేట నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలి

- విద్యార్థులకు అర్థవంతంగా విద్యాబోధన చేయాలి
- కొత్త టీచర్ల శిక్షణ తరగతుల్లో డీఈఓ




మాట్లాడుతున్న డీఈఓ జనార్ధన్‌రెడ్డి

పాణ్యం: కొత్తగా నియామక పత్రాలు అందుకున్న టీచర్లు చక్కగా విద్యాబోధన చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని నంద్యాల జిల్లా డీఈఓ జనార్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నూతన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ వారికి మార్గదర్శిగా నిలవాలన్నారు. ఈనెల 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, అవుకు ఎంఈఓ-2 వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్న కుమార్, ఏఎస్‌ఓ దస్తగిరిరెడ్డి, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, సంధ్యారాణి, తమ్మరాజుపల్లె హెచ్‌ఎం మద్దయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన అవుకు రిజర్వాయర్ రివిట్‌మెంట్

- కట్ట నుంచి లీకేజీ అవుతున్న నీళ్లు
- ఆందోళనలో రైతన్నలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆవేదన



కట్ట పై భాగం నుంచి లీకేజీ అవుతున్న నీళ్లు



కుంగిన రివిట్‌మెంట్

అవుకు(కొలిమిగుండ్ల): ఏడాది వ్యవధిలోనే రెండో సారి మళ్లీ అవుకు రిజర్వాయర్ లోపల భాగంలో ఎర్రటి రాళ్లతో నిర్మించిన రివిట్‌మెంట్ కుంగిపోయింది. శుక్రవారం తెల్లవారు జామున ఈఘటన చోటు చేసుకోవడంతో అవుకుతో పాటు చుట్టు పక్కల గ్రామాల రైతులు, ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు రిజర్వాయర్‌లో నీళ్ల సామర్థ్యం తగ్గించేందుకు చెర్లోపల్లె సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వ వద్ద గేట్లు ఎత్తి వైఎస్సార్ కడప జిల్లా గండికోటకు 8వేల క్యూసెక్కులు వదిలారు. రివిట్‌మెంట్ కుంగిన సమయంలో మొదట్లో ఎక్కువ మొత్తంలో నీళ్లు లీకేజీ అయ్యాయి. తర్వాత కుంగిన చోట లోపల రాళ్లు,మట్టి అడ్డుపడటంతో తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. 3.64 టీఎంసీల నీళ్లు నిల్వ ఉంచడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయానికి అధికారులు వచ్చారు. ఏడాది క్రితం రివిట్‌మెంట్ కుంగినప్పుడే నిపుణుల సాయంతో శాశ్వత పరిష్కారం చేసుంటే మళ్లీ ఈ పరిస్థితి తలెత్తేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. అప్పట్లో ఎస్సార్బీసీ అధికారులు నల్లమట్టి తీసుకొచ్చి కుంగిన చోట తాత్కాలికంగా పూడ్చివేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కట్ట దిగువన బండ్ నుంచి సీఫేజ్ వాటర్ చాలా రోజుల నుంచి లీక్ అవుతూనే ఉన్నాయి. అధికారులు లీకేజ్ వద్ద రాళ్లు అడ్డుపెట్టారు. ప్రస్తుతం రివిట్‌మెంట్ కుంగడంతో పైన నీళ్లు లీకేజీ అయ్యాయి. రిజర్వాయర్ వద్ద రివిట్‌మెంట్ కుంగిన విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని, ఇప్పటికైనా భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కాగా రిజర్వాయర్ వద్ద రివిట్‌మెంట్ కుంగిన ప్రదేశాన్ని ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్‌తో పాటు ఇతర అధికారులు పరిశీలించారు. ఎక్కువ నీళ్లు నిల్వ చేయడం వల్లనే కుంగిందని నిర్ధారణకు వచ్చారు. కట్ట వద్ద లీకేజీ అవుతున్న నీటిని పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రివిట్‌మెంట్ కుంగిన చోట మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.





నగరం వనం చెరువులో సాయం సంధ్య వేళ రిహార్సల్ చేస్తున్న క్రీడాకారులు



క్రీడాపోటీల సామగ్రి తరలిస్తూ..

జలక్రీడలకు వేళాయె!

గార్గేయపురంలోని నగర వనం చెరువు రాష్ట్ర స్థాయి కయాకింగ్ అండ్ కెనోయింగ్ (పెడల్ సహాయంతో పడవ నడిపే క్రీడ) పోటీలకు సిద్ధమైంది. జూనియర్స్, సీనియర్స్ స్త్రీ, పురుషుల విభాగాల్లో నేటి నుంచి జరిగే ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ కెనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలక్రీడా పోటీలకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే కొందరు క్రీడాకారులు చెరువులో రిహార్సల్స్ సైతం ప్రారంభించారు. ఆ దృశ్యాలివి..

-కర్నూలు (టౌన్)